

బీజేపీ మండలాధ్యక్షుడికి గులాబీ కండువా కప్పుతున్న హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్

# బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ మండలాధ్యక్షుడు

చిగురుమామిడి, నవంబర్ 20: బీజేపీ మండలాధ్యక్షుడు దుడ్డెల లక్ష్మీనారాయణ, నవాబ్‌పేటకు చెందిన ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బూర్ల బాలయ్యతో పాటు 40 మంది సోమవారం హుస్నాబాద్‌లో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ గెలుపు కోసం తమవంతు కృషి చేస్తామన్నారు. వీరి వెంట బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, నాయకులు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, మంకు శ్రీనివాస్‌రెడ్డి, పెసరి రాజేశం, సుద్దాల ప్రవీణ్, చాడ వేణుమాధవ్, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

# కలెక్టర్ పమేలా సత్పతికి ఓటు హక్కు



ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్ అందుకుంటున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, నవంబర్ 20: కలెక్టర్ పమేలా సత్పతి నగరంలో ఓటు హక్కు పొందారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఇటీవలే బదిలీపై జిల్లాకు వచ్చిన ఆమె ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. పరిశీలించిన ఎన్నికల అధికారులు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 51వ డివిజన్‌లో ఓటు హక్కు కల్పించారు. 146వ పోలింగ్ కేంద్రంలో 570 క్రమసంఖ్యలో కలెక్టర్ పేరు నమోదు కాగా, సోమవారం ఆ పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారి ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్ కలెక్టర్ చాంబర్‌లో ఆమెకు అందజేశారు. కాగా ఈనెల 30న జరుగనున్న పోలింగ్‌లో తాను ఓటు వేయబోతున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును గుర్తెరిగి బాధ్యతగా ఓటేయాలని పిలుపునిచ్చారు.

# సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్

రాంనగర్, నవంబర్ 20: శాసనసభ ఎన్నికల దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా కరీంనగర్‌లోని వన్‌టౌన్, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు వీధుల్లో సోమవారం స్థానిక పోలీసులు, స్పెషల్ యాక్షన్ టీం ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్, వాహన తనిఖీలు చేపట్టినట్లు సీపీ అభిషేక్ మహంతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హౌసింగ్‌బోర్డుకాలనీ, నాఖాచౌరస్తా, రాజీవ్‌చౌక్ వీధుల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో జరిగిన సంఘటనల ఆధారంగా సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాలను గుర్తించిన పలు వీధుల్లో సమావేశాలు నిర్వహించి ప్రజల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించామన్నారు. నేరస్తులు, రౌడీ షీటర్లు, ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే వ్యక్తులను సమావేశ పరిచి, ప్రజల సమక్షంలో ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించినట్లు తెలిపారు. ముందస్తు చర్యల్లో పలువురు పాత నేరస్థులను ఇప్పటికే సంబంధిత అధికారుల ముందు బైండోవర్ చేశామని, ఉల్లంఘించినట్లయితే పూచికత్తు సొమ్ము జప్తు చేయబడుతుందని అవసరమైతే జైలు శిక్ష విధించబడేలా చర్యలు తీసుకుంటామని వారికి వివరించనట్లు తెలిపారు. నిష్పక్షపాతంగా పూర్తి పారదర్శకతతో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు చేసేలా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ ముగిసేలా చూడడమే ముఖ్య ఉద్దేశమన్నారు. ఫ్లాగ్‌మార్చ్‌లో కరీంనగర్ టౌన్ ఏసీపీలు నరేందర్, సీఐలు రవికుమార్ (వన్ టౌన్), శ్రీనివాస (త్రీ టౌన్), స్పెషల్ యాక్షన్ టీంలు, స్థానిక పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

# ప్రతిపక్షాల మోసపూరిత హామీలను తిప్పికొట్టాలి

- రాష్ట్ర అభివృద్ధి కోసం పరితపించే కేసీఆర్‌ను తిరిగి దీవించాలి
- ఎస్సీల వర్గీకరణ పేరుతో బీజేపీ మాయమాటలకు మోసపోవద్దు
- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, తదితరులు

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 20: కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత హామీలను ప్రజలు తమ ఓటుతో తిప్పి కొట్టాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పట్టణంలోని మున్సిపల్ చైర్‌పర్సన్ గందే రాధికాశ్రీనివాస్ నివాసంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర సాధన కోసం పుట్టిందని, రాష్ట్రం సంపూర్ణ అభివృద్ధి కోసం రాజకీయ పార్టీగా అవతరించిన తర్వాత సీఎంగా కేసీఆర్ అనతికాలంలోనే తెలంగాణను ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలే గాక ఇవ్వని అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వర్తింపజేసిన గొప్ప నేత సీఎం కేసీఆర్ అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్టు, రైతుబంధు, రైతు బీమా, దళిత బంధు వంటి అనేక గొప్ప పథకాలను కుల మతాలకు అతీతంగా అమలు చేస్తున్న గొప్ప నేతగా కేసీఆర్ చరిత్రలో నిలిచిపోయారన్నారు. కాంగ్రెస్, బీజేపీ అవి పాలించే రాష్ట్రాలలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేక పోవడమే గాక తెలంగాణలో అబద్ధాలను ప్రచారం చేయడం సరికాదన్నారు. తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించాలని చూస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే సీఎం కేసీఆర్ ఎక్కడా సభలు పెట్టిన లక్షలాదిగా ప్రజలు తరలివచ్చి సభలను విజయవంతం చేస్తున్నారని అదే కాంగ్రెస్, బీజేపీ పెట్టిన సభలకు ప్రజలు లేక వెలవెలబోతున్నాయని గుర్తు చేశారు. ప్రతిపక్షాల మాయ మాటలను ప్రజలు నమ్మడం లేదు.. కాబట్టే వారి సభలకు ప్రజలు వెళ్లడం లేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేయాలని చూస్తుందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ అమలు చేస్తున్న వాటిని కాంగ్రెస్, బీజేపీలు తమ మ్యానిఫెస్టోలో కాపీ కొట్టి మార్పులు చేర్పులతో తిరిగి ప్రజల ముందు ఉంచి ఓట్లు వేయించుకునే ప్రయత్నం చేస్తున్నాయని తెలిపారు. ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ ప్రకటించిన పలు పథకాలను ముందుగా అమలు చేయాలన్నారు. తెలంగాణలో ఎలాంటి గాలి లేకున్నా ఊపు ఉందని, కాంగ్రెస్ గాలి ఉందని కొందరి చేత తప్పుడు ప్రచారం చేయించుకుంటూ ప్రజలను నమ్మించే విధంగా వట్టి భ్రమలు కల్పిస్తూ ఓట్లు పొందాలని చూస్తుందని, వారి భ్రమలకు తెలంగాణ ప్రజలకు మోసపోరన్నారు.

## ఏబీసీడీ వర్గీకరణ పేరుతో మోసం

తెలంగాణలో ఎస్సీల ఓట్లు పొందేందుకు ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ అని, బీసీ ముఖ్యమంత్రి అని ప్రజల్లో భ్రమలు కల్పించి, బీజేపీ తెలంగాణలో ఓట్లు దండుకోవాలని చూస్తుందని బండ శ్రీనివాస్ ఆరోపించారు. పదేండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఇంతవరకు ఎందుకు వర్గీకరణ చేయలేదో ముందుగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల స్టంట్‌గా మాత్రమే ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ అని కొట్టిపారేశారు. కొత్తగా కట్టిన పార్లమెంటుకు కనీసం అంబేద్కర్ పేరు పెట్టలేని అసమర్థ పార్టీ బీజేపీ అని ఆయన విమర్శించారు. ఇంటికో ఉద్యోగం అని దేశవ్యాప్తంగా ప్రకటించి యువతను మోసం చేసింది బీజేపీ కాదా..? అని ప్రశ్నించారు. తెలంగాణలో యువతకు ఉద్యోగాల పేరు చెప్పి ఓట్లు దండుకోవాలని చూస్తే యువత మోసపోయే వాళ్లు కాదని పేర్కొన్నారు. ప్రతి ఎకరాకు నీళ్లు అందిస్తున్న గొప్ప ప్రాజెక్టు అయిన కాళేశ్వరానికి కనీసం జాతీయ హోదా ఇవ్వలేని అసమర్థ పార్టీ బీజేపీ అని ఆయన ఆరోపించారు. తెలంగాణలో అభివృద్ధికి ఎలాంటి నిధులు ఇవ్వకుండా, అభివృద్ధిని అడ్డుకుంటున్నది ఆ పార్టీ వారేనని ఆయన గుర్తు చేశారు. కేంద్రప్రభుత్వం ప్రకటించి ఇచ్చిన 20 జాతీయ అభివృద్ధి అవార్డుల్లో 19 తెలంగాణకు వచ్చింది నిజం కాదా..? అని ప్రశ్నించారు. అభివృద్ధి చూసే కదా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు అవార్డులు ఇచ్చింది అని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలకు వంద శాతం న్యాయం జరుగుతుంది సీఎం కేసీఆర్‌తోనేనని అన్నారు. సీఎం కేసీఆర్‌కు ప్రజలు అండగా ఉంటారని, హుజూరాబాద్ ఎమ్మెల్యేగా పాడి కౌశిక్‌రెడ్డిని గెలిపిస్తారన్న నమ్మకముందని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందే రాధికాశ్రీనివాస్, హుజూరాబాద్ సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వర్థినేని రవీందర్‌రావు, నాయకులు పోరెడ్డి శాంతన్‌రెడ్డి, పోతరవేణి అనిల్‌యాదవ్ పాల్గొన్నారు.

# సరైన అభ్యర్థికి ఓటేయండి..

- పోల్ చీటిల వెనుక కొటేషన్ల ముద్రణ
- పోలింగ్ కేంద్రాల గుర్తింపునకు గుగూల్ మ్యాపు
- ఓటరు మార్గదర్శకాల పుస్తకాల పంపిణీ
- ఇంటింటికీ చేరవేస్తున్న బీఎల్‌వోలు



ఓటరుకు పోల్ చీటిలు అందజేస్తున్న బీఎల్‌వో

కలెక్టరేట్, నవంబర్ 20: రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో మునుపెన్నడూ లేని విధంగా ఎన్నికల సంఘం ఈసారి అత్యంత పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. ప్రధానంగా ఎన్నికల నిర్వహణ కోసం సరికొత్త వ్యూ హాలతో ముందుకు సాగుతూనే, ఓటర్లను చైతన్యపర్చేందుకు విశేష కృషి చేస్తోంది. ఇప్పటికే పలు రకాల సంస్కరణలు తెచ్చిన ఎన్నికల సంఘం, తాజాగా పోల్ చీటిలు కూడా వినూత్నంగా ముద్రించి పంపిణీ చేస్తుంది. ఓటు వేసేందుకు వెళ్లే ఓటరు పడే ఇబ్బందులను తొలగించేందుకు కృషి చేస్తోంది. 'సరైన అభ్యర్థికి ఓటేయండి.. భయం లేకుండా ఓటేయండి.. ప్రలోభాలకు గురికావద్దు..' అంటూ తదితర కొటేషన్లు పోలింగ్ స్లిప్పు కు వెనుకవైపు ముద్రించిన ఎన్నికల సంఘం ఓటరుకు అవగాహన కల్పిస్తోంది. గతంలో కేవలం ఓ టరు పేరు, పోలింగ్ బూతు నెంబరు, ఓటరు కార్డు సంఖ్య మాత్రమే స్లిప్పుపై ఉండేది. ఈసారి అలా కాకుండా పోలింగ్ చీటి వెనుకవైపున ఓటరు తన ఓటు హక్కు వినియోగించుకునేందుకు వెళ్లా ల్సిన పోలింగ్ బూతు చిరునామాతో పాటు, అక్కడికి వెళ్లేందుకు దారిని కూడా చూపేలా గుగూల్ మ్యాపు ముద్రించారు. అలాగే, ఎన్నికల్లో పారదర్శకతను పెంపొందించే క్రమంలో పోలింగ్ సిబ్బంది, ఇతరులెవరైనా సమస్యలు సృష్టిస్తే, వెంటనే తమకు ఫిర్యాదు చేసేలా సీ-విజిల్ యాప్, టోల్ ఫ్రీ నెంబర్, ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటరు అనుసరించాల్సిన విధివిధానాలతో ముద్రించిన మూడు పేజీల ఓటరు గైడ్ కూడా అందజేస్తున్నారు. అభ్యర్థులు కానీ, రాజకీయ పార్టీల నాయకులు కానీ, ఇతరులెవరైనా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే వెం టనే 1950 ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయాలని సూచిస్తోంది. అలాగే, ఓటర్లకు కలిగే సందేహాల నివృత్తి కోసం పోలింగ్ కేంద్రం పేరుతో పాటు, బీఎల్‌వో ఫోన్ నెంబర్ కూడా ముద్రించారు. పోలింగ్ రోజున బీఎల్‌వోలు పం పిణీ చేసిన ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పుతో పాటు ఎన్నికల సంఘం సరఫరా చేసిన ఓటర్ గుర్తింపు కార్డు లేని వారు ప్రత్యామ్నాయంగా ఈసీ సూ చించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి వెంట తీసుకుని రావాలని అంశాలు కూడా వీఐఎస్ వెనుకవైపు పొందుపరచడం గమనార్హం. దీంతో ఓటర్లలో చైతన్యం పెరిగి తమ ఓ టు హక్కును సక్రమంగా వినియోగించుకునే అవకాశాలుంటాయని ఎన్నికల సంఘం భావిస్తోంది.

## ముమ్మరంగా పోలింగ్ చిట్టీల పంపిణీ

జిల్లాలోని నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పోలింగ్ చీటిల పంపిణీ ప్రక్రియ ముమ్మరంగా కొ నసాగుతుంది. 1338 బూత్ స్థాయి అధికారులు తమ బూత్‌ల పరిధిలోని ఓటర్లకు చిట్టీలు అందజేస్తున్నారు. ఓటర్లకు స్వయంగా అందజేస్తూ, వా రితో రిజిస్టర్‌లో సంతకం చేయిస్తున్నారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 3,55,054 ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులు ముద్రించగా, ఈనెల 25లోపు 390 బూతుల్లో పూర్తిస్థాయిలో పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు. హుజూరాబాద్‌లో 2,49,558 బీఐఎస్‌లు ముద్రించి, 305 మంది బీఎల్‌వోలతో ఓటర్లకు అందజేస్తున్నారు. వీటిని నేటి వరకు పంపిణీ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. చొప్పదండి పరిధిలోని ఓటర్ల కోసం 2,32,990 ముద్రించి, 327 మంది బీఎల్‌వోలతో ఈనెల 23 వరకు అందజేయాలని సూచించారు. మానకొండూర్ సెగ్మెంట్ పరిధిలో 2,21,613 స్లిప్పులు ముద్రించి, 316 మంది బీఎల్‌వోలతో బుధవారం వరకు ప్రతీ ఓటరుకు అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు.